సాక్షి
చిత్తూరు
ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



కూరగాయల వితరణ

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి ఓ దాత పలు రకాల కూరగాయలను వితరణగా అందజేశారు. - 8లో



రాజనాలబండ పేరు చెప్పగానే..!

రాజనాల బండ శ్రీఆంజనేయ స్వామి పేరు చెప్పగానే చోరీ చేసిన సొత్తు తిరిగిచ్చేసినట్టు భక్తులు తెలిపారు. - 8లో



ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిస్కం కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. - 8లో


న్యూస్‌రీల్

నేడు కామధేను వాహన సేవ

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం కామధేను వాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం అభిషేకం, అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. రాత్రికి కామధేను వాహనంపై స్వామి వారు విహరిస్తారని ఆయన పేర్కొన్నారు.



పత్రికా విలేకరులపై కేసులా?



ఎవరిపైనన్నా కావాలనే తప్పుడు న్యూస్ రాస్తే కూడా దానికి రీజాయిండర్ ఇస్తారు. కానీ ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన న్యూస్‌ను రాస్తే దానిపై విలేకరులు, ఆ పత్రిక ఎడిటర్‌పై కేసులు పెట్టడం దేశంలో ఎక్కడైనా ఉందా..? ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా పిలవబడే పత్రికలకు అసలు మన రాష్ట్రంలో స్వేచ్ఛ ఉందా...? ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతోందనే అక్కసుతో ఓ పత్రికపై మాత్రమే కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా కేసులు పెట్టిస్తోందనే విషయం సాధారణ ప్రజలకు సైతం అర్థమవుతోంది. పత్రికలపై కన్నెర్ర చేసిన ఎన్నో ప్రభుత్వాలు గతంలో కాలగర్భంలో కలిసిపోయాయి. ఈ విషయాన్ని ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ఆలోచనచేస్తే బాగుంటుంది.

- వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

కలానికి సంకెళ్లా?



సమాజంలో జరిగే అన్యాయాలను వెలుగుచూపడంలో పత్రిక కీలకంగా పనిచేస్తోంది. నిర్భయంగా అన్యాయాలను పత్రికల ద్వారా వెలుగులోకి తేవడం పాత్రికేయుల విధి. నిజాన్ని నిర్భయంగా పత్రికలు ప్రచురించడంలో తప్పులేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికలపై దాడులు ఎక్కువయ్యాయి. ప్రశ్నించే గొంతు నొక్కాలని చూస్తోంది. చిన్నచిన్న వార్తాలు ప్రచురితమైతే కూడా కేసులు పెట్టిస్తోంది. ఇలా కలానికి సంకెళ్లు వేయడం కరెక్టు కాదు. విచారణ పేరుతో పోలీసులు వేధించడం తగదు. పోలీసులు కూడా వాస్తవాలను తెలుసుకోవాలి. ప్రభుత్వ తప్పిదాలను బయట పెడితే పగబడుతోంది. ఇందుకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్న విషయం మరిచిపోతే ఎలా?

-సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

భయంకరి



పలమనేరులో ఓ మదపుటేనుగు హల్‌చల్ చేసింది. అడవిలోంచి ఒంటరిగా జనావాసాల్లోకి వచ్చి బీభత్సం సృష్టించింది. దాన్ని చూసి జనం కేకలు వేయడంతో మరింత చిర్రెత్తిపోయింది. దాదాపు ఆరు గంటలపాటు రోడ్లపై స్వైరవిహారం చేసింది. అడ్డొచ్చిన వారిపై ఎదురుదాడికి దిగింది. బుల్లెట్‌పై వచ్చిన ఎఫ్‌ఎస్వో సుకుమార్‌పై దాడికి తెగబడింది. తనదారికి అడ్డొచ్చిన వాహనాలను ఎత్తిపడేసింది. ఓ లేగదూడపైన ఉరిమింది. అడవిలోకి మళ్లించేందుకు ప్రయత్నించిన ట్రాకర్‌పై దాడి చేసి.. ఆ తర్వాత అడవిలోకి వెళ్లింది. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

పలమనేరులో ఒంటరి ఏనుగు స్వైరవిహారం

- కౌండిన్య నుంచి పట్టణ ఆవాసాల్లోకి చొరబడిన వైనం
- ఏనుగు దాడిలో ఎఫ్‌ఎస్వోకు, మావటికి తీవ్రగాయాలు
- ట్రాకర్స్ దారిమళ్లించే క్రమంలో ఎదురుదాడి
- ఎట్టకేలకు గంటావూరు వద్ద అడవిలోకి వెళ్లిన ఏనుగు
- ఊపిరి పీల్చుకున్న ఫారెస్ట్ అధికారులు



ఎఫ్ఆర్వో సుకుమార్‌పై దాడి చేస్తున్న ఏనుగు



పలమనేరు పట్టణంలో సంచరిస్తున్న మదపుటేనుగు

పలమనేరు: కౌండిన్య ఎలిఫెండ్ శాంచురీ సమీపంలోని అడవిలోంచి ఓ ఒంటరి ఏనుగు శనివారం ఉదయం పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు సమీపంలోకి వచ్చింది. ఇదే సమయంలో ఈ ప్రాంతంలో వాకింగ్ చేస్తున్న వారు గమనించి స్థానిక ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌ఎస్వో సుకుమార్ తన సిబ్బంది ట్రాకర్స్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాణసంచా పేలుస్తూ ట్రాకర్స్ ఏనుగును మళ్లించే ప్రయత్నం చేశారు. దీంతోపాటు స్థానికుల అరుపులు, కేకలు, సెల్‌ఫోన్లలో వీడియోలు తీయడం లాంటివి చేశారు. ఆగ్రహించిన ఏనుగు జనంపైకి ఎదరుదాడికి దిగింది. ఇదే సయంలో పాత కీలపట్ల రోడ్డు వద్ద బుల్లెట్‌పై వచ్చిన ఎఫ్‌ఎస్వో సుకుమార్ పైకి దాడికి పాల్పడింది. ఆయన తప్పించుకునే ప్రయత్నంలో బైక్‌ను ఆపి పరుగెత్తబోయి కిందపడ్డాడు. ఆ ఏనుగు అతనిపై పడి నలిపేసింది. జనం గట్టిగా అరుపులు పెట్టగా ట్రాకర్లు నాగరాజు తదితరులు రాళ్లతో ఏనుగుపై దాడి చేశారు. దీంతో అది అక్కడి నుంచి పక్కకెళ్లింది. 108 సమయానికి రాకపోవడంతో ఫారెస్ట్ వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఏనుగు దాడిలో సుకుమార్‌కు కాలు, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ ప్రథమ చికిత్సలనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఆరు గంటలపాటు హల్‌చల్

ప్రజల అరుపులు, అలజడితో ఏనుగు ఘీకాంరాలు చేస్తూ ఎటు వెళ్లాలో తెలియక రాఘవేంద్రస్వామి ఆలయం, చిన్నూరు, బైపాస్‌రోడ్డు, గంటావూరు, బెంగళూరు- చెన్నై హైవే బైపాస్ తదితర ప్రాంతాల్లో హల్‌చల్ చేసింది. హైవేలో ఏనుగు వెళుతున్నప్పుడు వందలాది మంది రోడ్డుపక్కన గుమిగూడారు. ఏనుగు కారణంగా బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ ఆగిపోయింది. ఏనుగును చూసేందుకు జనం రోడ్డుపై ఆగిన వాహనాలపై ఎక్కి గోల చేశారు. దీంతో మరింత భయపడిన ఏనుగు గంటావూరు వద్ద టెర్రకోట దుకాణాల మధ్య రోడ్డుపై వెళుతూ రోడ్డు పక్కన పార్క్ చేసిన పలు కార్లను పైకెత్తేందుకు ప్రయత్నించింది. అక్కడికి వచ్చిన ఫారెస్ట్ జీపుపై దాడికి రాగా డ్రైవర్ చాకచక్యంగా జీపును రివర్స్‌చేసి వెళ్లిపోయాడు.



పుష్పపల్లకీ వాహన సేవకు పోటెత్తిన భక్తులు

వైభవంగా పుష్పపల్లకీ సేవ



కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి శనివారం పుష్పపల్లకీపై ఊరేగుతూ కనువిందు చేశారు. ఆంధ్రతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

మద్దతు ఏది బాబూ?



మాట్లాడుతున్న హరిబాబునాయుడు

తవణంపల్లె: ‘సీఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాలోనే మామిడి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు తోతాపురి కిలోకు రూ.8, ప్రభుత్వ సబ్సిడీ కింద కిలోకు రూ.4 చెల్లిస్తామని చెప్పి తీవ్రంగా అన్యాయం చేస్తున్నారు’అని జిల్లా రైతు సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని అరగొండలో మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు హరిబాబునాయుడు మాట్లాడుతూ మామిడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న చిత్తూరు మామిడి మార్కెట్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. రైతులు సీఎం సొంత నియోజకవర్గం కుప్పం నుంచి పుత్తూరు, నగరి నియోజకవర్గం వరకు ట్రాక్టర్లలో తరలివచ్చి నిరసన చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

కోపమెక్కువ..జాగ్రత్త



అడవిలోంచి జనావాసాల్లోకి వచ్చే మదపుటేనుగులు చాలా కోపంగా ఉంటాయని, వీటితో జనం జాగ్రత్తగా ఉండాలని స్థానిక అటవీశాఖ అధికారి నారాయణ సూచించారు. జనం ఎక్కువగా కేకలు పెట్టడం, దాన్ని తరమడం చేసినప్పుడు ఏం చేయాలో దిక్కుతోచక జనంపైకి తిరగబడుతుందన్నారు.

మదపుటేనుగుల సంచారం...

కౌండిన్య అడవిలో పదిదాకా మదపుటేనుగులుండగా వాటిల్లో ఐదుదాకా మృత్యువాతపడ్డాయి. ప్రస్తుతం నాలుగైదుదాకా ఒంటరిగా సంచరిస్తూ తరచూ జనావాసాలవైపు వస్తున్నాయి. అయితే ఇది తక్కువ వయసున్న మదపుటేనుగని, కొత్తగా ఇటువైపు వచ్చిందని స్థానిక ఎఫ్ఆర్వో నారాయణ మీడియాకు తెలిపారు. ఎఫ్‌ఎస్వో సుకుమార్‌పై జరిగిన దాడిలో ఆయన ఏనుగుకు అత్యంత సమీపంలో ఉండడం, కాలు జారి కిందపడడంతో తప్పించుకొనే అవకాశం లేకుండా పోయింది.



మావటిపై దాడి!



అక్కడి నుంచి గంటావూరు వైపుకెళ్లిన ఏనుగును అడవిలోకి మళ్లించేందుకు స్థానిక ఎలిఫెంట్ ట్రాకర్స్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో కుంకీ ఎలిఫెంట్లకు మావటి హరి దీన్ని నిలువరించే ప్రయత్నం చేయగా అతనిపై దాడికి తెగబడింది. గాయపడిన మావటిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. గతంలోనూ హరి ఏనుగులను మళ్లించే క్రమంలో చేతిలో బాంబుపేలి గాయపడ్డాడు. అక్కడి నుంచి వెళుతూ గడ్డి మేస్తున్న ఓ లేగదూడను తొక్కుకెళ్లింది.

ఎట్టకేలకు అడవిలోకి..

పలమనేరు పట్టణంలో ఆరుగంటల పాటు అటవీశాఖ, ప్రజలకు ముప్పుతిప్పలు పెట్టించిన ఏనుగు గంటావూరు సమీపంలో అడవిలోకి వెళ్లింది. దీంతో ఎలిఫెంట్ ట్రాకర్స్ ఊపిరి పీల్చుకున్నారు. కానీ అదే మదపుటేనుగు మళ్లీ ఇదే ప్రాంతానికి వస్తుందని ట్రాకర్స్ అనుమానిస్తున్న నేపథ్యంలో జనం భయపడుతున్నారు.



పోలీస్ బాస్ తుషార్ డూడీ

- ఎస్పీ మణికంఠ బదిలీ.. పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం
- సోమవారం చిత్తూరులో డూడీ బాధ్యతల స్వీకరణ!



తుషార్ డూడీ



మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నూతన ఎస్పీగా తుషార్ డూడీ నియమితులయ్యారు. ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ మణికంఠను బదిలీ చేశారు. ఈయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

కూటమి నేతలకు నచ్చక?

గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏప్రిల్ 4వ తేదీన మణికంఠ చిత్తూరు ఎస్పీగా నియమితులయ్యారు. దాదాపు 17 నెలల పాటు చిత్తూరు ఎస్పీగా మణికంఠ రాణించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన దాదాపు 45 మంది కానిస్టేబుళ్లను ఈయన సస్పెండ్ చేశారు. ఇదే సమయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు అధికారులపై విచారణకు ఆదేశించినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక పుంగనూరులో జరిగిన ఓ టీడీపీ కార్యకర్త హత్య ఘటనలో కూటమి పార్టీకి చెందిన ఎమ్మెల్యే నుంచి నాయకుల వరకు మణికంఠపై ఒంటికాలితో పైకిలేచారు. ఓ దశలో ఈ హత్యకు మణికంఠ బాధ్యత వహించాలని, తాము అడిగిన పోలీసులకు ఆయా స్టేషన్లలో పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం వల్లే హత్య జరిగిందని బురదను కూడా చల్లారు. బంగారుపాళ్యంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించడం, కార్యకర్తపై జరిగిన దాడిపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మన్‌ను సస్పెండ్ చేయడం అనైతికమంటూ ఆ పార్టీ నేతలు విమర్శలు ఎక్కుపెట్టారు. ప్రధానంగా కూటమి పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలకు మణికంఠ పనితీరు నచ్చలేదనే చెప్పాలి. దీనిపై ఏకంగా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఎస్పీ బదిలీల ప్రక్రియలో మణికంఠకు స్థానచలనం కలగడం అధికారపార్టీ నేతలకు ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి.

క్రమశిక్షణ ప్రధానం

చిత్తూరు కొత్త ఎస్పీగా నియమితులైన డూడీకు క్రమశిక్షణే ప్రధానం. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయన ప్రస్తుతం బాపట్ల ఎస్పీగా పనిచేసి చిత్తూరుకు వస్తున్నారు. డూడి స్వస్థలం రాజస్థాన్‌లోని ఝున్ఝున్ నగరం. ఇండోర్ ఐఐటీలో ఇంజినీరింగ్ చదివిన ఈయన.. మూడో ప్రయత్నంలో సివిల్ సర్వీసుకు ఎంపికై ఐపీఎస్ అధికారి అయ్యారు. కర్నూలులో ఐపీఎస్ శిక్షణ పూర్తి చేశారు. గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా సర్వీస్‌లో చేరారు. వైఎస్ఆర్ కడప జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తూ పదోన్నతి పొంది 2024 ఫిబ్రవరిలో గుంటూరు ఎస్పీగా పనిచేశారు. గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, మన్యంలో చింతపల్లి ఏఎస్పీగా కూడా పనిచేశారు. తుషార్ డూడీకి ఎస్పీగా చిత్తూరులో మూడో పోస్టింగ్. సోమవారం ఇక్కడ బాధ్యత తీసుకునే అవకాశముంది.

కుంకీలతో బిల్డప్

పలమనేరు: పలమనేరు పట్టణంలో శనివారం హల్‌చల్ చేసిన మదపుటేనుగు విషయం సామాజిక మాధ్యమాల్లో భారీగా ప్రచారమైంది. ఈ నేపథ్యంలో కుంకీలతో మదపుటేనుగును ఎందుకు అదుపు చేయలేదనే మాటలు వినిపించాయి. డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు స్థానిక ఫారెస్ట్ అధికారులు శనివారం రాత్రి మదపుటేనుగు అడవిలోకి వెళ్లిన చోటుకు రెండు కుంకీ ఏనుగులను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్ మాట్లాడుతూ మళ్లీ మదపుటేనుగు ఇక్కడికి రావచ్చనే అనుమానంతో రెండు కుంకీలను తెచ్చామన్నారు. అయితే పట్టణ వాసులు ఎవ్వరూ ఇలాంటి చోటుకు రాకూడదని హెచ్చరించారు. ఇలా ఉండగా కూటమి ప్రభుత్వం ప్రజల్లో ఏదో చేస్తున్నామనే మాట నిలబెట్టుకోవడానికే ఈ నాటకాన్ని చేస్తోందని స్థానికులు గుసగుసలాడడం గమనార్హం.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇంజినీర్ మృతి


సంతోష్‌కుమార్ (ఫైల్)

పుత్తూరు: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీర్ మృతి చెందాడు. సీఐ శేఖర్‌రెడ్డి కథనం మేరకు.. తమిళ నాడు రాష్ట్రం అరక్కోణం వద్ద కిజ్‌కుప్పం గ్రామానికి గజేంద్ర అడియార్ రెండో కుమారుడు జి.సంతోష్‌కుమార్(34) రేణిగుంట వద్ద గల న్యూలింక్ కంపెనీలో ఇంజినీర్. రెండు రోజుల పాటు కంపెనీకి సెలవు రావడంతో శుక్రవారం రాత్రి పనిముగించుకొని టూ వీలర్‌పై అరక్కోణంకు బయలుదేరాడు. రాత్రి 9 గంటల సమయంలో పరమేశ్వరమంగళం గ్రామం వద్ద ముందు వెళ్తున్న లారీ దారితప్పి వెళ్తున్నామని గుర్తించి డ్రైవర్ ఒక్కసారిగా యుటర్న్ తీసుకున్నాడు. టూ వీలర్‌పై వెళ్తున్న సంతోష్‌కుమార్ అదుపు తప్పి లారీని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వయస్సుకు వచ్చిన కుమారుడు ఉద్యోగంలో స్థిరపడి పెళ్లి సంబంధాలు చూస్తున్న వేళ మృత్యువాత పడడంతో ఆ కుటుంబ శోకసంద్రంలో మునిగిపోయింది. లారీ డ్రైవర్‌ను అదులోకి తీసుకొని పోలీసులు కేసు దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వం విద్యాసంస్థలకు జాతీయ పురస్కారం



అవార్డును అందుకుంటున్న విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి సిటీ : విశ్వం సైనిక్ నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు 'బెస్ట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్-25' ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం బెంగుళూరు వేదికగా జరిగిన భారతీయ శిక్షణ రత్న అవార్డులు–2025 కార్యక్రమంలో భాగంగా ఈ వార్డును ఆ సంస్థ ప్రతినిధులు మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంతోష్ హెగ్డే, ప్రముఖ విద్యావేత్త రంజన రజోర శర్మ చేతుల మీదుగా విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్. విశ్వచందన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కర్ణాటక మంత్రి హెచ్ ఆంజనేయ, ఆధ్యాత్మిక నాయకులు డాక్టర్ మలయ శాంతముని, నటుడు చేతన్ కుమార్ పాల్గొని విశ్వం విద్యాసంస్థలకు అభినందనలు తెలిపారు.

డాక్టర్ల దాడిపై కేసు నమోదు

చిత్తూరుఅర్బన్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని పీజీ డాక్టర్ల దాడిపై టూటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం అర్ధరాత్రి పీజీ వైద్యులపై కొందరు విద్యార్థులు, వారి స్నేహితులు దాడి చేశారు. దీనిపై బాధిత డాక్టర్లు రక్షిత్, సరస్, యోగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడిచేసిన మొగిలేశ్వర్, షరీఫ్, లోకేష్, యశ్వంత్, వినేష్, సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నెట్టికంఠయ్య వెల్లడించారు.

కూరగాయల వితరణ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఓ దాత ఆదివారం పలు రకాల కూరగాయలను వితరణగా అందజేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వెంకట్‌రెడ్డి సుమారు 2.5 టన్నుల కూరగాయలను అందించారు. కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగ స్వామి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాచమార్గం!

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక
- జిల్లా వ్యాప్తంగా అదాలత్‌లో 5,345 కేసుల పరిష్కారం


కక్షిదారులకు అవార్డు అందజేస్తున్న జిల్లా జడ్జి అరుణసారిక

చిత్తూరు లీగల్/అర్బన్: కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమైన మార్గమమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్‌అదాలత్‌ల ద్వారా పరిష్కరిస్తూ.. కక్షిదారులకు సత్వర న్యాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, న్యాయమూర్తులు శ్రీనివాసరావు, శ్రీదేవి, శిరీష, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎనిమిదో స్థానం

చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అదాలత్‌లో 5,345 కేసులను పరిష్కరించి రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. ఇందులో చిత్తూరులో 1,652 కేసులు, తిరుపతిలో 1,488, వాయల్పాడు 82, తంబళ్లపల్లె 186, శ్రీకాళహస్తి 245, సత్యవేడు 308, పుత్తూరు 214, పుంగనూరు 139, పీలేరు 78, పలమనేరు 245, పాకాల 94, నగరి 104, మదనపల్లె 695, కుప్పంలో 84 కేసులు పరిష్కరించారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర అవార్డు


రాష్ట్ర అవార్డు గ్రహీత శరత్‌చంద్రశేఖర్‌కు మెమెంటో అందజేసి అభినందిస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వేలాది మంది పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసినందుకు అధ్యాపకులు శరత్‌చంద్రశేఖర్‌కు రాష్ట్ర ఉత్తమ అవార్డు దక్కిందని రిటైర్డ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆనందరెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం రాష్ట్ర అవార్డు గ్రహీత శరత్‌చంద్రశేఖర్‌కు అభినందన సభ నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ హెడ్‌మాస్టర్ వీరరాఘవనాయుడు మాట్లాడుతూ శరత్‌చంద్రశేఖర్ పనిచేసిన కళాశాలల్లో విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 29 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 29 మందికి రూ.2.9 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శనివారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 29 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.9 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కళాశాలలు ఎలా నిర్వహించాలి?



మాట్లాడుతున్న హేమచంద్రనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ) నిధులు విడుదల చేయకపోతే కళాశాలలు ఎలా నిర్వహించాలని ఎస్‌పీయూ అసోసియేషన్ ఈసీ మెంబర్ హేమచంద్రనాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శనివారం ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు చెల్లించాల్సిన ఆర్‌టీఎఫ్ నిధుల మంజూరుకు ఆందోళనలు చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏపీప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్నం సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈనెల 20లోపు విడుదల చేయాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని, లేని పక్షంలో ఈనెల 22వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలు మూసివేస్తామని హెచ్చరించారు.

ఇంత చిన్నచూపా?


మురళీనాథ్

పలమనేరు: సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మురళీనాథ్ శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. తమను వలంటీర్లుగా మార్చేశారన్నారు. రకరకాల సర్వేలు, ఇంటింటికీ వెళ్లి మ్యాపింగ్‌లు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు 50 కుటుంబాలకు చేస్తున్న సేవలను సైతం తమవద్దే చేయిస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సైతం తమ వద్ద చేయించడం సమంజసం కాదన్నారు.

నేడు, రేపు మహిళా సాధికారత సదస్సు


రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

తిరుపతి అర్బన్ : మహిళల సాధికారత అంశాన్ని అజెండాగా చేసుకుని ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిని వేదికగా తీసుకుని దేశస్థాయి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. లోకసభ స్పీకర్ ఓంబిర్లా ఆధ్వర్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్లమెంటరీ అండ్ లెజిస్లేటివ్ కమిటీ సమావేశాన్ని ఆది, సోమవారం జరుపుకోనున్నారు. సదస్సు ముఖ్య ఉద్దేశ్యం వికసిత్ భారత్‌లో భాగంగా మహిళలు సైతం డిజిటల్ దిశగా అడుగులు వేయడానికి, క్వాంటమ్ కంప్యూటరింగ్, బయో టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయ, వ్యాపార రంగాల్లో మహిళల పాత్ర తదితర సెక్టార్లకు సంబంధించి చర్చలు జరపనున్నారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు తదితరులు లైజన్, నోడల్ అధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

నేడు ముఖ్య అతిథులు రాక

ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు పలువురు వీఐపీలు రానున్నారు. సదస్సుకు సంబంధించి రెండు రోజుల పాటు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం చంద్రగిరి కోటను సందర్శించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులతో పాటు లోకసభ స్పీకర్ ఓంబిర్లాతో పాటు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, లోకసభ కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ చైర్‌పర్సన్ చరితారెడ్డి, పలువురు ఐఏఎస్ సీనియర్ అధికారులు ఆదివారం హాజరు కానున్నారు. అలాగే సోమవారం ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నారు.

సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10 టీవీలకు పాస్‌లు నిలుపుదల

జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ మహిళా సదస్సు కార్యక్రమానికి మీడియాకు సమాచారశాఖ వారు ఆహ్వానం పలికారు. అయితే దేశ స్థాయిలో సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో సమాచారశాఖ నుంచి పాస్‌లు జారీ చేసిన వారు మాత్రమే హాజరు కావాలని స్పష్టం చేశారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10 టీవీలకు చెందిన రిపోర్టర్లకు పాస్‌లను ఇవ్వడం లేదని సమాచారశాఖ జిల్లా అధికారి గురుస్వామి శెట్టి స్పష్టం చేశారు.

ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి


పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిస్కం కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం సంఘం 5వ వార్షికోత్సం సందర్భంగా చిత్తూరులోని ఆశాఖ అతిథిగృహంలో సమావేశం నిర్వహించారు. ఉద్యోగ రీత్యా అందరూ కలిసి పనిచేసిన రోజులు గుర్తు చేశారు. అనంతరం 70 ఏళ్లు దాటిన విశ్రాంత ఉద్యోగులు మురళి, రమణమూర్తి, సుబ్రమణ్యంశెట్టి, మోహనపిళ్లై, గంగమ్మనాయుడు, ఏకాంబరం, రెడ్డెప్పనాయుడు, చంద్రబాబు, రంగయ్యనాయుడు, శివన్‌కుట్టి, ప్రకాష్, సుబ్రమణ్యంశెట్టి, గుణశేఖర్, రామచంద్రన్, అబ్దుల్‌సలాం, రాజామండడి, ముత్తు, మారిముత్తు, పార్థసారథి, జయపాల్, సూర్యబాబు, చెంగల్రాయశెట్టి, శ్రీరాములకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. సంఘం డివిజన్ కార్యదర్శి మునిరత్నంశెట్టి, నాయకులు ప్రకాష్, వేణుగోపాల్‌అయ్యర్, ప్రభావతి, మురళి, మోహన్‌రాజ్, మునిరత్నంశెట్టి, బాబునాయుడు పాల్గొన్నారు.

రాజనాల బండ పేరు చెప్పగానే..!

చౌడేపల్లి: రాజనాలబండ ప్రసన్నాంజనేయస్వామి పేరు చెప్పగానే చోరీ చేశామని నేరం అగీకరించి, సుమారు రూ.50 వేల నగదు ఇచ్చేశారని భక్తులు తెలిపారు. చిత్తూరు, బంగారుపాళెం, బి.కొత్తకోటకు చెందిన పలువురు బాధితులు రాజనాలబండకు చేరుకొని స్వామివారి పాదాల చెంత లభించిన నగదు, నగలను పెట్టి పూజలు చేశారు. అందులో మచ్చుకు ఒకటి..చౌడేపల్లె మండలం, ఆమినిగుంట పంచాయతీ, రామయ్యగట్లుకు చెందిన రాజశేఖర్ ఇంట్లో గత నెల 27న చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలోని నగదు రూ.50 వేలు చోరీ చేశారు. గుర్తించిన రాజశేఖర్ ఇంట్లో వారిని, చుట్టుపక్కల వారిని విచారించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దల ఆధ్వర్యంలో పంచాయితీ నిర్వహించారు. రాజనాల బండలో ప్రమాణం చేయాలని తీర్మానించారు. గత శనివారం రాజనాలబండకు చేరుకొని ముందుగానే ఈ నెల 13వ తేదీ ప్రమాణం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆపై విషయాన్ని గ్రామ పెద్దలకు వివరించారు. శనివారం ఉదయం ఇంటికొక మనిషి రాజనాల బండకు ప్రమాణం చేయడానికి బయలు దేరాల్సి ఉండగా రాజశేఖర్ ఇంటి ఆవరణలో నగదు ప్రత్యక్షమైంది. ఈ విషయాన్ని బాధితులు గ్రామస్తులకు తెలిపి కుటుంబ సభ్యులతో ఆలయం వద్దకు చేరుకొని పూజలు చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, అర్చకుడు కృష్ణమూర్తి పూజలు చేసి బాధితులకు సొమ్ము అందజేశారు.

ఆఫీసు సబార్డినేటర్ల సంఘం ఏకగ్రీవం


ఎంపికైన జిల్లా కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా వాణిజ్య పన్నులశాఖ ఆఫీసు సబార్డినేటర్ ఉద్యోగుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. శనివారం జిల్లా వాణిజ్య పన్నులశాఖ జేసీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడారు. ఏడు పదవులకు గాను అదే సంఖ్యలో నామినేషన్ రావడంతో సంఘం ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నమన్నారు. ఎన్నికల అధికారిగా బీ.గోపాలకృష్ణయ్య, సహాయ ఎన్నికల అధికారిగా కే.చెన్నకేశవులు వ్యవహరించారన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.మనోహరనాయక్, ఉపాధ్యక్షులుగా తిప్పన్నా, పి.సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.మునికృష్ణయ్య, కార్యాలయ కార్యదర్శిగా సి.రవి, సంయుక్త కార్యదర్శిగా కె.భరత్, జిల్లా కోశాధికారిగా డి. షఫీను ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు వివరించారు. మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : సవాళ్లను ఎదుర్కొంటూనే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన టీచర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో పురస్కారాలు పొందిన నౌషాద్ అలీ, గోపీనాథ్‌రెడ్డి, కమలాపతి, సుబ్రహ్మణ్యం, మీనాక్షి, రాధాకుమారి, ప్రసన్నకుమారి, రామకృష్ణ, ఆనందయ్య తదితరులను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

రైలు నుంచి జారి కిందపడి..!

పుత్తూరు: మండల పరిధిలోని వేపగుంట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నెంబర్ 3పై వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఓ యువకుడు శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో కింద పడి మృత్యువాత పడ్డాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ ఎం.ధర్మేంద్రరాజు కథనం.. డిబ్రుగస్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల లోపు ఉంటుంది. నలుపు రంగు ప్యాంటుపై సన్నని గీతల డిజైన్ ఉంది. తెలుపు రంగు షర్ట్, దానిపై సన్నని పూలు గల డిజైన్ ఉంది. మృతుడి వద్ద ఎలాంటి ఐడీ కార్డు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.